క్లుప్తంగా

రాఘవుడికి ప్రత్యేక పూజలు



శ్రీమఠంలో అయోధ్య రామ మందిరం నమూనాను తిలకిస్తున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి గురువారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని అర్చనలు చేశారు. రాఘవేంద్రుల మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. అలాగే శ్రీమఠంలో శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిరం నమూనాను తిలకించారు. ఆయనతోపాటు తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, శివకుమార్, ఈరన్న ఉన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.60 వేలు విరాళం



దాతలకు బాండును అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని సింధనూరుకు చెందిన నాగశంకర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ.60,001 నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు.

8న డాడ్జ్‌బాల్ సెలక్షన్స్

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ డాడ్జ్‌బాల్ పోటీలకు ఈ నెల 8న సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు డాడ్జ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు టీపీ.కంబిరెడ్డి, కార్యదర్శి సాబీర్ అహ్మద్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ డాడ్జ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సెలక్షన్స్‌లో సీనియర్ మెన్స్, ఉమెన్స్ కేటగిరీకి చెందిన వారు పాల్గొనవచ్చన్నారు. స్థానిక ఎస్‌కేడీ కాలనీ కల్లుమఠం సమీపంలో ఉదయం 9 గంటలకు సెలక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వరకు మహారాష్ట్రలోని ఎల్లోరాలో జరిగే జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు వారి ఆధార్ కార్డుతో హాజరు కావాలని వివరాలకు 70135 63203 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మీడియా సంస్థలపై దాడులు ఆపాలి

ఆదోనిఅర్బన్: మీడియా సంస్థలపై దాడులను ఆపాలని, పత్రికా స్వేచ్ఛకు ఆటంకం కలిగించవద్దని కోరుతూ గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజ్, ఉపాధ్యక్షుడు ఉరుకుందప్ప, ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ మీడియాపై దాడులకు తెగబడడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యూఢిల్లీలో ఈనెల 3వ తేదీన ఒకేరోజు 46 మంది జర్నలిస్టులు, రచయితలు, కవులు, కళాకారులపై దాడులు చేసి అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు, అరెస్టులు పునరావృత్తంగాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి కేటాయింపులకు చట్టబద్ధత కల్పించాలి

ఆదోనిరూరల్: బ్రిజేష్ ట్రిబ్యునల్ పాత కేటాయింపులకు చట్టబద్ధత కల్పించి కొత్త కేటాయింపుల్లో రాయలసీమకు 400 టీఎంసీలు ఇవ్వాలని రాయలసీమ కో–ఆర్డినేటర్ కమిటీ (ఆర్‌సీసీ) పొలిటికల్ ఆర్గనైజర్ రాజన్న అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ రాయలసీమలోని కొన్ని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరిపిందని, రాజోలిబండ కుడి కాలువకు 4 టీఎంసీలు, గుండ్రేవులకు 17 టీఎంసీలు కేటాయించిందన్నారు. వీటికి చట్టబద్ధత కల్పించే విషయంలో ట్రిబ్యునల్‌పై కోర్టుల్లో కేసులు నడుస్తుంటే ఈ తగువును ఇలాగే వదిలేసి కొత్త మాటలు మాట్లాడడం కేంద్రానికి సబబు కాదన్నారు. ఆర్‌డీఎస్ పనులు ప్రారంభించి పునాదులు తవ్వి వదిలేశారని, అలాగే గుండ్రేవుల గురించి ఇప్పటివరకు ఆలోచనే లేదన్నారు. ప్రాజెక్టుల విషయమై ఈనెల 10న కర్నూలు పశ్చిమ ప్రాంతంలో అన్ని సంఘాలను కలుపుకొని అవగాహన యాత్ర నిర్వహిస్తామన్నారు.

ప్రజారోగ్యానికి సు'రక్ష'



హనుమాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు



వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రక్త పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆదోనిటౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో 17, 18, 19, 20, 21 వార్డులకు సంబంధించి 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి ప్రారంభించారు. వివిధ జబ్బులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన టెంట్లలో ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పొందారు.

10 మంది వైద్యులతో పరీక్షలు

కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కర్నూలు నుంచి ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లు, పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని ఏడుగురు డాక్టర్లు, 50 మంది ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది వైద్య సేవలందించారు. ప్రతిఒక్కరికీ పరీక్షలు చేయడం, జబ్బులకు సంబంధించిన వివరాలను తెలుసుకొని మందులు రాసిచ్చారు. శిబిరంలో 14 రకాల వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్లు మౌనిక, హర్షిత, సార్థిత, వినోద్‌కుమార్, రవళి, మాలిక్ తెలిపారు. జబ్బులు, జనరల్ చెకప్‌లు, జనరల్ ఓపీ, చిన్నపిల్లల జబ్బులు, గర్భిణులు, బీపీ, షుగర్, ఆర్థో, కంటి, రక్త, మూత్ర పరీక్షలు, మలేరియా, డెంగ్యూ, మొలలకు సంబంధించిన వ్యాధులకు చికిత్స అందించారు.

ఆదోనిరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం కింద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పెద్దకడబూరు: వైద్యం కోసం ఎవరూ ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో గురువారం సర్పంచ్ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. సురక్ష ద్వారా ఉచితంగా 7 రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్లజోడు అందిస్తున్నారని వివరించారు. శిబిరంలో ఎమ్మెల్యే బీపీ, షుగరు చెక్ చేయించుకున్నారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి ఆహార పదార్థాలను రుచిచూశారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం

గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ. 21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సర్పంచ్ ఇందిర, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరితో కలసి ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ప్రారంభించారు. ప్రజల వద్దకు పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్ర రెడ్డి, తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఎంపీడీఓ ప్రభాకర్, డాక్టర్ తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా గ్రామాల్లో ఉచితంగా చికిత్స అందించే కార్యక్రమాన్ని జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు అందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. వైద్యులు ఇమ్మానుయేల్, శిరిష, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి నర్సన్న, నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని జుమ్మాలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌కుమార్ సమక్షంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకురాలు నాగమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ఓపీ ద్వారా 331 మందికి వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు నజీర్ అహ్మద్, రజిత, గైనికాలజిస్ట్ మౌనిక, చిన్న పిల్లల డాక్టర్ సమిఉల్లా, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీపీ, షుగర్‌కు మందులిచ్చారు



మా గ్రామంలో రెండు రోజులుగా ఏఎన్ఎం, వలంటీర్ మా ఇంటికి వచ్చి అవ్వా ఆరోగ్యం ఎలా ఉందని అడిగారు. నాకు జ్వరం కాళ్ల నొప్పులు, షుగర్ ఉందని సమాధానం చెప్పారు. అయితే గురువారం గ్రామంలో డాక్టర్లు వస్తారు. చెక్ చేసుకుంటావా అని అడిగారు. వారు చెప్పిన ప్రకారం గ్రామానికి వచ్చిన డాక్టర్లను కలిసి షుగర్, బీపీ, జ్వరం పరీక్షలు చేయించుకున్నాను. ఉచితంగా మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– ఈరమ్మ, జుమ్మాలదిన్నె

కంటి పరీక్ష చేయించుకున్నాను



వయస్సు పైబడడంతో కొద్ది రోజులుగా కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. ఏఎన్ఎం మా ఇంటికి ఆరోగ్య వివరాలు అడిగినప్పుడు నాకున్న సమస్యను చెప్పాను. గురువారం శిబిరానికి కంటి డాక్టర్లు వస్తారు చెక్ చేయించుకోమని చెప్పింది. గ్రామానికి కంటి డాక్టర్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు వెళ్లి పరీక్షలు చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఇలాంటి శిబిరాల వల్ల మాలాంటి వారికి ఎంతో ఉపయోగం.

– అంజినయ్య, జుమ్మాలదిన్నె



ఆదోని వైద్య శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న సిబ్బంది



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



నారాయణపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



తోవి గ్రామంలో వైద్య పరీక్షలు



జుమ్మాలదిన్నెలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రుద్రగౌడ

నేటి వైద్య శిబిరాల షెడ్యూల్



వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

ఆదోని సెంట్రల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఇంటింటి ఆరోగ్య సర్వే కార్యక్రమం చేపట్టారు. ప్రతి కుటుంబంలోని వ్యక్తులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వారి వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించనున్నారు. శుక్రవారం ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు.

- ఆదోని మండలం సాదాపురం గ్రామ సచివాలయంలో డాక్టర్ బి.ఇబ్రహీం పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కోసిగి మండలం దుద్ది గ్రామం మండల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ వి.మనోజ్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కౌతాళం మండలం హల్వి గ్రామ సచివాలయంలో డాక్టర్ యం.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుంది.
- మంత్రాలయం మండలం కచ్చాపురం కగ్గల్లు గ్రామంలో డాక్టర్ బి.సురేష్ పర్యవేక్షణలో శిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలందించనున్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి సన్నిధిలో గడిపారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

అకౌంటెంట్ ఆకస్మిక మృతి



రమణ (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఎంఈఓ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రమణ గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. పట్టణంలోని మేదర్‌గేరికి చెందిన రమణ అకస్మాత్తుగా కుప్పకూలడంతో తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న తోటి సిబ్బంది, ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు. మట్టి ఖర్చులకుగాను మండల విద్యాధికారి బి.శివరాములు ప్రభుత్వం తరపున రూ.15 వేలు అందించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారు ఆస్పరి రోడ్డులో గురువారం బైకు అదుపు తప్పికిందకు పడిపోవడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు వెంకటేష్, ఆయన కోడలు శ్రీలతగా తెలిసింది. వారు తుగ్గలి నుంచి ఆదోనికి వస్తుండగా ఆస్పరి రోడ్డులో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు.

నిండుకుండలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్



నిండుగా ఉన్న మాధవరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

కోసిగి: మండల పరిధిలోని జుమ్మాలదిన్నె గ్రామ శివారులో ఉన్న మాధవరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా కళకళలాడుతోంది. మరో రెండు రోజుల్లో రిజర్వాయర్ కడగం ఎక్కి ప్రవహిస్తుందని అధికారులు తెలిపారు. ఈ రిజర్వాయర్‌ను 70 ఎంపీఎఫ్‌టీ కెపాసిటీతో నిర్మించారు. గత 25 ఏళ్లుగా రిజర్వాయర్‌ను నింపి రైతులకు పుష్కలంగా సాగునీటిని అందించిన దాఖలాలే లేవు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో పై ప్రాంత ఇరిగేషన్ అధికారులతో చర్చించి నాలుగేళ్లుగా రిజర్వాయర్ నిండుగా నింపి రైతులకు సాగునీటి అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా సాగునీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో అభివృద్ధి పనులను ముమ్మరం చేసినట్లు సర్పంచ్ శిల్ప తెలిపారు.గత మూడు రోజుల నుంచి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో డ్రైనేజీల్లో పూడికతీత, దళిత కాలనీల్లో విద్యుత్ లైన్లపై ఏర్పడ్డ ముళ్ల కంపలను తొలగించే పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కారిస్తామని పేర్కొన్నారు.

చట్టం నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు



సాంబగల్లులో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్,ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్: మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన పాపాలకు శిక్ష అనుభవించాల్సిందేనని, ఆయన అవినీతి లీలలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో సాంబగల్ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. 150కు పైగా ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్ల పాలనలో 98 శాతానికిపైగా హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని, వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలులో ఉన్నాడని, ఔటర్ రింగ్ రోడ్డు స్కాంలో కూడా శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. ఆయన తనయుడు నారా లోకేష్, ఇతర మాజీ మంత్రులు కూడా త్వరలో జైలుకు పోతారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, నాయకులు రామలింగేశ్వరయాదవ్, గురునాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌గౌడ్, అస్రంభాద్రి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడు తూ.. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్డు సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.ప్రారంభించిన పనులను మూడు నెలల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వర్షం పడితే కార్యాలయ ఆవరణలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉండేదని, మున్సిపల్, సబ్‌కలెక్టర్ సహకారంతో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఇంజినీర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఆదోనిటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు వెంకన్నపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జున, పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సన్నద్ధం కావాలి

ఆదోనిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్య దర్శి, వర్గ సభ్యులు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. సామాన్య, పేదల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రజలపై భారం వేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఈనెల 16, 17, 18వ తేదీ ల్లో చేపట్టే ప్రచార జాతాలను విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ నాయకులు తిప్పన్న, ముక్కన్న, వీరేష నాగేంద్ర, కృష్ణమూర్తి, నాగరాజు, ఖాన్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

కోసిగి: ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు లూసమ్మ, పద్మ, వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నుంచి గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ అమలు చేస్తోందని, ఇందులో భాగంగా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఫోన్‌లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల పనిభారం అవుతోందని, మానసికంగా ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

అందరి సహకారంతో ఓటరు జాబితా ప్రక్షాళన

ఆదోనిరూరల్: లోపాలు లేని ఓటర్ జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమకరించాలని ఆదోని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 256 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిలో 24 పోలింగ్ స్టేషన్‌లకు సదుపాయాలు సరిగా లేనందువల్ల కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. 24 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పునకు, ప్రతిపాదన సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సూచనలు ఉంటే తెలియజేయవచ్చని, వీఆర్వోలు పరిశీలించి తగిన నివేదికలు ఇస్తారని సూచించారు. పోలింగ్ స్టేషన్లు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్లలో ర్యాంపు, టాయిలెట్లు విత్ రన్నింగ్ వాటర్, విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ వివరించారు.

శ్రీమఠంలో ఎమ్మెల్యే పూజలు



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గురువారం సాయంత్రం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వాదం చేశారు. ఆయనతోపాటు శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్, పీఏ ధర్మకారి నాగేశ్వరరావు, యిల్లారి నరేంద్రశెట్టి, అంపయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు: ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో మరో వాహన డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు లోడుతో బుధవారం రాత్రి బయలుదేరిన ఐచర్ వాహనాన్ని చిలమత్తూరు మండలం మన్రో తోపు సమీపంలో వెనుక నుంచి దూసుకొచ్చిన మరో ఐచర్ ఢీకొంది. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్, కర్నూలు జిల్లా కోసిగికి చెందిన బుసప్ప (39) అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళుతున్న వాహనాన్ని గమనించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.